సాక్షి
మెదక్
శనివారం, 30, నవంబర్, 2024



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- విద్యార్థులతో కలెక్టర్ రాహుల్‌రాజ్
- సందడిగా ఇన్‌స్పైయిర్, సైన్స్ ఎగ్జిబిషన్

మెదక్‌జోన్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇన్‌స్పైయిర్, వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం వెస్లీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను తిలకించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్, గణితాన్ని ఇష్టపడి చదవాలన్నారు. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడానికి నూతన ఆవిష్కరణలు కనుగొనాలని ఆకాంక్షించారు. ఆహారం ఆరోగ్యం, పరిశుభ్రత 53, సహజ వ్యవసాయం 42, రవాణా కమ్యూనికేషన్ 70, విపత్తుల నిర్వహణ 43, వ్యర్థాల నిర్వహణ 45, గణిత నమూనా 48, ఇన్‌స్పైయిర్ 36 అంశాలలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం ఎక్కడ అభివృద్ధి చెందుతుందో ఆప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంటుందన్నారు. ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాల్లో ప్రజలు వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వాపోయారు. అలాంటి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా విద్యార్థులు ఎగ్జిబిట్లను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీఈఓ రాధాకిషన్, డీఎస్‌ఓ రాజిరెడ్డి, టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజలకు చేరువగా ఉంటూ, ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డయల్ 100 పై తక్షణమే స్పందించాలన్నారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. శాంతి భద్రతలు కాపాడడంలో బ్లూ కోల్ట్స్ సిబ్బంది ముందుండాలని చెప్పారు. సీసీ కెమెరాలతో నేరాలను అదుపులో ఉంచవచ్చని అన్నారు. ఆయా గ్రామాలకు కేటాయించిన అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటించాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, చిలప్‌చెడ్ ఎస్ఐ నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు పండుగకు తరలిరావాలి

మెదక్‌కలెక్టరేట్: నేడు మహబూబ్‌నగర్ జిల్లాలో పెద్దఎత్తున రైతు పండుగ నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల నుంచి రైతులను తరలించడానికి 15 బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే శనివారం సాయంత్రం 4 గంటలకు జిల్లాలోని అన్ని రైతు వేదికల వద్ద కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేస్తామని వివరించారు. రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేట అభివృద్ధికి కృషి



వీరోజిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో మన ఊరిలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పంచాయతీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్యంతో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. త్వరలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, సంతోష్, సంగమేశ్వర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం: ఏబీవీపీ



రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెదక్‌జోన్: విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస వసతులు లేక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని వాపోయారు. ఫుడ్ పాయిజన్‌తో ఎంతోమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, ఇప్పటివరకు 51 మంది చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, నగర కార్యదర్శి అనిల్, సంయుక్త కార్యదర్శి కార్తికేయ, నాగరాజు, అర్జున్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వసతి లేని గృహాలు

- విద్యార్థులను వేధిస్తున్న సమస్యలు
- రగ్గులు, మంకీ క్యాప్‌లు, స్వెట్టర్లు కరువు
- చన్నీటి స్నానంతో వణుకు..
- 40 శాతం వార్డెన్లు ఇన్‌చార్జిలే..

వసతి గృహాలు	ప్రీ మెట్రిక్	పోస్టుమెట్రిక్	విద్యార్థులు	వార్డెన్లు	ఖాళీలు
బీసీ	17	4	1,976	16	5
ఎస్సీ	17	3	1,970	13	7
ఎస్టీ	7	3	1,550	7	3



వెల్దుర్తి బీసీ వసతి గృహంలో చన్నీటి స్నానం చేస్తున్న విద్యార్థులు

మెదక్‌జోన్: సంక్షేమ వసతి గృహాల్లో వసతి కనుమరుగైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. కానీ అవి అధ్వానంగా మారాయి. జిల్లాలోని అధికశాతం సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి ఇలాగే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే చలికాలం కావడంతో విద్యార్థులు చన్నీటి స్నానం అంటేనే జంకుతున్నారు. అలాగే కొన్ని హాస్టళ్లకు ఇప్పటివరకు రగ్గులు రాలేదు. మరికొన్నింటిలో మంకీ క్యాపులు, స్వెట్టర్లు ఇవ్వలేదు. వార్డెన్లు సైతం 40 శాతం ఇన్‌చార్జిలే కావడంతో వసతి గృహాల్లో ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. ఫలితంగా విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 51 వసతి గృహాలు

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ అన్నీ కలిపి 51 ఉన్నాయి. ప్రీ మెట్రిక్‌లో 3 నుంచి 10వ తరగతి, పోస్టు మెట్రిక్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై చదివే విద్యార్థులు ఉంటారు. అందులో 36 మంది రెగ్యులర్ వార్డెన్లు ఉండగా, 15 మంది ఇన్‌చార్జి వార్డెన్లు ఉన్నారు. వీటి పరిధిలో 5,851 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారు. నీటిని వేడి చేసుకునేందుకు ప్రొవిజన్ ఉన్నా ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహాల్లో వేడినీటి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు. అలాగే జిల్లాలో ఎస్సీ వసతి గృహాలు 20 ఉండగా, వాటిలో 13 ప్రీ మెట్రిక్, 7 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 2,331 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా పోస్టు మెట్రిక్ విద్యార్థులకు బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు ఇచ్చా రు. కానీ ప్రీ మెట్రిక్ విద్యార్థులకు బెడ్‌షీట్లతో పాటు మంకీ క్యాపులు, స్వెటర్లు రావాల్సి ఉంది. అవి ఇప్పటివరకు రాలేదని సంబంధిత జిల్లా అధికారులు చెబుతున్నారు. ఎస్టీ వసతి గృహాలు 10 ఉండగా, వాటిలో ప్రీ మెట్రిక్ 7 ఉన్నాయి. అందులో 1,050 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పోస్టు మెట్రిక్ వసతి గృహాలు 3 ఉండగా, వాటిలో 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో బ్లాంకెట్లు, స్వెటర్లు ఇప్పటికీ రాలేదు. బెడ్‌షీట్లు, కార్పెట్లు మాత్రమే ఇచ్చారు. బీసీ వసతి గృహాలు 21 ఉండగా, వాటిలో 17 ప్రీ మెట్రిక్ గృహాలు ఉన్నాయి. వాటిలో 1,506 మంది విద్యార్థులు చదువుకుంటుండగా. పోస్టుమెట్రిక్ నాలుగింటిలో 470 మంది చదువుకుంటున్నారు. వీరికి ప్రభు త్వం నుంచి రావాల్సిన బెడ్‌షీట్లు, కార్పెట్లతో పా టు ఇతర వస్తువులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

వేడి నీరు అందించాలి



చలి విపరీతంగా ఉండడం, ఆపై చన్నీళ్లు కావడంతో రెండు రోజులకోసారి స్నానం చేస్తున్నాం. ఇప్పటివరకు దుప్పట్లు సైతం రాలేదు. దీంతో చలికి ఇబ్బందులు పడుతున్నాం. స్నానానికి వేడినీరు అందించి ఆదుకోవాలి.

– రాంగోపాల్,
ఎస్సీ వసతిగృహం విద్యార్థి, నిజాంపేట



తెలంగాణ తల్లి కటౌట్‌కు పూలాభిషేకం చేస్తున్న పద్మారెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

సబ్బండ వర్గాలను ఏకం చేశాం

- 14 ఏళ్ల పోరాట ఫలితమే తెలంగాణ
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి
- 'దీక్షా దివస్' విజయవంతం

మెదక్ మున్సిపాలిటీ: సబ్బండ వర్గాలను ఏకం చేసి, 14 ఏళ్ల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ఉద్యమం చేసేటప్పుడు ఎంతో మంది అవహేళనగా మాట్లాడారని గుర్తు చేశారు. అహింసతోనే తెలంగాణ తీసుకురావాలని కేసీఆర్ దీక్ష చేపట్టగా, అప్పటి ప్రభుత్వం కుట్ర పన్ని పోలీసులతో దీక్షను భగ్నం చేసిందన్నారు. రాష్ట్ర సాధనలో ఎంతో మంది అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాకముందు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉండేదని, ఆడబిడ్డలకు తాగు నీటి గోస ఉండేదన్నారు. పాదయాత్ర చేస్తామని అల్టిమేటం జారీ చేస్తే రైతుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో అధ్వానమైన పాలన జరుగుతుందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరలో బయటకు రాబోతున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వదిలి పెట్టమని హెచ్చరించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన రోజు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో ముందుకెళ్లడం వల్లనే తెలంగాణ సాధ్యమైందన్నారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌కు ఆనాడు సహకరించామని గుర్తుచేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని రేవంత్‌రెడ్డి అంటున్నారని, ముట్టుకుంటే తెలుస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో హామీలను నెరవేర్చకపోగా, అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగించాలన్నారు. కేసీఆర్ పాలన వచ్చే వరకు కలిసి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, నాయకులు నర్సింలు, చంద్రాగౌడ్, శేఖర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

తప్పులు లేకుండా నమోదు చేయాలి

అదనపు కలెక్టర్ నగేష్

నర్సాపూర్: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. శుక్రవారం బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ, మండలానికి చెందిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో 40 శాతం నమోదు చేశామని, మిగిలిన ప్రక్రియ కొనసాగుతుందని ఆర్డీఓ మహిపాల్ వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని, డిసెంబర్ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అనంతరం అదే కాలేజీలో ఏర్పాటు చేసిన కౌడిపల్లి మండల సర్వే వివరాల నమోదును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మధులత, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్ తదితరులు ఉన్నారు. అనంతరం ఈనెల 30వ తేదీన మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆఫ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్- 2 పరీక్ష సెంటర్‌ను కాలేజీలో ఏర్పాటు చేయగా అధికారులతో కలిసి పరిశీలించారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

బ్యాంకుల పనితీరు బేష్

మెదక్ కలెక్టరేట్: మహిళా సాధికారతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సకాలంలో రుణాలు అందజేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకు కంట్రోలర్స్, డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీ విషయంలో బ్యాంకుల పనితీరు అభినందనీయమని కొనియాడారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి, మహిళా సాధికార లక్ష్యంగా రుణాల మంజూరుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గతేడాది లక్ష్యాల కంటే మెరుగైన ఫలితాలు సాధించడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లా వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ రంగాలలో రూ. 5,857 కోట్ల రుణాల లక్ష్యం ఉండగా, రూ. 2,646 కోట్ల రుణాలు ఇచ్చామని అధికారులు వివరించారు.

భరోసా ఇచ్చేలా పనిచేయాలి

మంత్రి శ్రీధర్‌బాబు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రానికి, ప్రజలకు సేవ చేయడానికి పోలీసు ఉద్యోగం గొప్ప అవకాశమని, ప్రజలకు భరోసా ఇచ్చేలా పనిచేయాలని శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లను ఉద్దేశించి మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం అమీన్‌పూర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్ల నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రవిగుప్త, ఎస్పీఎఫ్ డీజీపీ అనిల్ కుమార్, ఎస్పీఎఫ్ డీఐజీ మాధవరావులతో కలసి మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విధుల్లో రాణించేందుకు పోలీసులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందన్నారు. రాష్ట్ర భద్రత, పురోగతి పోలీసుల చేతుల్లోనే ఉందని, బాధ్యతలు నిర్వర్తించే సమయంలో క్రమశిక్షణతో, అంకితభావంతో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అధికారులు పాసింగ్ అవుట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జ్ఞానమే ఆడపిల్లలకు ఆభరణం



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ మున్సిపాలిటీ: జ్ఞానమే ఆడపిల్లలకు నిజమైన ఆభరణమని, మహిళల చైతన్యంతో దేశాభివృద్ధి సాధ్యమని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం టౌన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మహిళల రక్షణ, సైన్స్, మూఢ నమ్మకాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మూఢ నమ్మకాలను వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పరేషన్

దుకాణాలకు చేరని రేషన్ బియ్యం



బియ్యం స్టాక్ లేక వెలవెలబోతున్న నర్సాపూర్ గోదాం

నర్సాపూర్: రేషన్ దుకాణాలకు ఇంకా బియ్యం చేరలేదు. దీంతో పంపిణీ ఆలస్యం కానుంది. జిల్లా గోదాంల నుంచి మండలస్థాయిలో ఉన్న గోదాంలకు బియ్యం సకాలంలో పంపకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. నర్సాపూర్‌లోని ప్రభుత్వం గోదాం నుంచి నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల్లోని రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తారు. కాగా స్థానిక గోదాంకు బియ్యం సరిపడా రానందున స్టాకు లేక గోదాం వెలవెలబోతుంది. నర్సాపూర్ మండలంలోని 35 రేషన్ దుకాణాలకు 2,343 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా, శుక్రవారం సాయంత్రానికి 14 దుకాణాలకు బియ్యం సరఫరా చేశారు. ఇంకా 21 దుకాణాలకు రావాల్సి ఉంది. కౌడిపల్లి మండలంలోని 24 రేషన్ దుకాణాలకు 1,856 క్వింటాళ్లు, చిలప్‌చెడ్ మండలంలోని 14 రేషన్ దుకాణాలకు 1,012 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్క దుకాణానికి బియ్యం సరఫరా కాలేదు. కాగా కొల్చారం మండలంలో 22 దుకాణాలకు 1,757 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా, ఇప్పటివరకు మెదక్ గోదాం నుంచి ఆరు దుకాణాలకు మాత్రమే బియ్యం సరఫరా చేశారు. శివ్వంపేట మండలంలో 33 రేషన్ దుకాణాలకు 2,144 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా, 4 దుకాణాలకు మాత్రమే బియ్యం చేరింది. మిగిలిన 29 దుకాణాలకు ఇంకా చేరలేదు. గడువులోగా రేషన్ పంపిణీ సాధ్యం కాదని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదాంల నుంచి తమ దుకాణాలకు బియ్యం చేరనందున పంపిణీకి గడువు పెంచాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్డీఓ మహిపాల్‌ను వివరణ కోరగా.. రెవెన్యూ డివిజన్‌లోని అన్ని మండలాలకు కావాల్సిన బియ్యం త్వరలోనే వస్తాయని తెలిపారు. ఇప్పటివరకు కొన్ని దుకాణాలకు చేరాయని, మిగిలిన అన్ని దుకాణాలకు త్వరలోనే చేరుతాయని చెప్పారు. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, అందరికీ రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీల్లో మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థి లిఖిత్ క్యారమ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. జావేద్ 100 మీటర్ల రన్నింగ్‌లో, నందకిషోర్ షాట్‌పుట్‌లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సతీష్, పీడీ గుండి ప్రవీణ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం (ఎంఈఓ) బచ్చలి సత్తయ్య తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన అండర్ 14 విభాగంలో విద్యార్థులు గైని భరద్వాజ్ హర్షిత్, మోహిత్ విజయ్, భాను ప్రియ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. వీరంతా డిసెంబరు రెండో వారంలో మెదక్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం సత్తయ్య ప్రత్యేకంగా అభినందిస్తూ శిక్షణిచ్చిన పీఈటీ రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం



కిట్ ఆర్టికల్‌ను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

దుబ్బాక : గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా సిద్దిపేటను తయారు చేద్దామని సీపీ అనురాధ అన్నారు. శుక్రవారం దుబ్బాక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలతోపాటు సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ ఏరియా, పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్‌ను, రికార్డు రూమ్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగకుండా నిఘాను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడూ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై స్కూల్స్, కాలేజీల్లో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

పోలీసులు ఆరోగ్యాలు జాగ్రత్త

ఆరోగ్యాలపై పోలీసు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సీపీ సూచించారు. పోలీస్ సిబ్బంది సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వాకింగ్, రన్నింగ్, యోగాను తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, కోర్టు లైజనింగ్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, సీసీ నితిన్‌రెడ్డి, ఏఎస్‌ఐ సంధాని తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000707]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253927]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA24000705]

■ TATA లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పని చేయుటకు అడ్వయిజర్స్ కావలెను. కమీషన్ ఇవ్వబడును. పార్ట్/ఫుల్ టైం. Cont: 9912666151 [H-1265952]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చలి పంజా..

- రోజురోజుకూ పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే రెండో స్థానంలో న్యాల్‌కల్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఎండలో కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతూ చలి తీవ్రత పెరుగుతూ వస్తుంది. చలి తీవ్రతకు తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు రావాలంటే వణుకుతున్నారు. పొగ మంచు వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో చలి నుంచి ఉపశమనం పొందేందుకు మంటలు వేసుకొని కాపుకుంటున్నారు. వ్యవసాయదారులు ఉదయాన్నే పొలానికి వెళ్లాలంటే జంకుతున్నారు. ఎండ వచ్చి చలి తీవ్రత తగ్గాకే పనులకు వెళ్తున్నారు. ఉదయం 10 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గకపోవడంతో ఎప్పుడు జనసందడిగా ఉండే ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.

8.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు

న్యాల్‌కల్‌లో రోజురోజుకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 8.1 డిగ్రీల అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, 8.2 డిగ్రీల ఉష్ణోగ్రతతో న్యాల్‌కల్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అలాగే జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. చలికి తోడు చల్లని గాలులు వీస్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత వల్ల రైతులు, కూలీలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పత్తి తీసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అసలే కూలీల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులు చలి వల్ల ఉన్న కూలీలు ఇబ్బందులు పడుతుండడంతో చేతికి వచ్చిన పత్తి పొలాల్లో నేలరాలుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో తగ్గిన హాజరుశాతం

చలి తీవ్రత కారణంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పడిపోతుంది. జిల్లాలో ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 2.50 లక్షలు మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చలికి తట్టుకునే స్వెటర్లు, ఇతర దుస్తులను ధరించి పాఠశాలలకు వెళ్తున్నారు. మధ్యాహ్నం కూడా చలి తగ్గకపోవడంతో పాఠశాలల ఆవరణలో ఎండలో కూర్చుని చదువుకుంటున్నారు. రోజుకు 72 నుంచి 80 శాతం మేర విద్యార్థులు పాఠశాలలకు హాజరవుతున్నట్లు సమాచారం.



చలి తీవ్రతతో స్వెటర్లు వేసుకొని పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

బడికి స్వెటర్లతో వెళ్తున్నాం



ఉదయం 9 గంటలైనా చలి తగ్గడం లేదు. పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తప్పని పరిస్థితుల్లో స్వెటర్లు వేసుకొని బడికి వెళ్తున్నాం. స్వెటర్లు వేసుకున్నా చలి వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

– శ్రేయ, విద్యార్థి జెడ్పీహెచ్‌ఎస్, న్యాల్‌కల్

పొలానికి వెళ్లలేకపోతున్నాం



ఐదారు రోజుల నుంచి చలి ఎక్కువగా ఉంటుంది. పత్తి ఏరేందుకు ఉదయం 6 గంటలకే పొలాలకు వెళ్లే వాళ్లం. చలి వల్ల ఆలస్యంగా వెళ్తున్నాం. ఎండ వచ్చినప్పటికీ చలి మాత్రం తగ్గడం లేదు. చలి వల్ల కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు.

– సంగప్ప, కూలీ

హాజరుశాతం తగ్గుతుంది



ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉంది. దీంతో పాఠశాలలకు వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చలి, జ్వరాల వల్ల 3 నుంచి 4 శాతం మేర హాజరు తగ్గింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు స్వెటర్లు, చలికి తట్టుకొనే ఇతర దుస్తులు వేసి బడికి పంపాలి.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

భవనంపై టీవీ డిష్ తీస్తుండగా..

- నాలుగో అంతస్తు పై నుంచి పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు కథనం మేరకు.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీను (40) భార్య సుజాతతో కలిసి బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలె ఇక్కడి ఉంచి మరో చోటుకి ఇల్లు మారాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి పై ఉన్న టీవీ డిష్‌ను తీసుకునేందుకు వచ్చి నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. స్థానికులు కుటుంబ సభ్యులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

శివ్వంపేట(నర్సాపూర్) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి భోజ్యా పంచాయతీ మాల్యా తండాకు చెందిన రాట్ల రంజీ(60) ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రెండు, మూడు రోజుల కోసారి ఇంటికి వచ్చేవాడు. 27 ఇంట్లో నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం గంగాయిపల్లి గ్రామ శివారులోని చింత చెరువులో రంజీ మృతదేహం తేలడంతో స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొట్టిన బైక్

- ఇద్దరు అక్కడికక్కడే మృతి



సాయిలు(ఫైల్)



వంశీ(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : హార్వెస్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి శివారులో చోటు చేసుకుంది. మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళీ కథనం మేరకు.. మెదక్ మండలం పేరూర్ గ్రామానికి చెందిన గొండ్ల సాయిలు(47), తిప్పపురం యేసుమణి, వెంకటిల ఏకైక కుమారుడు వంశీ(25) ఇద్దరూ కలిసి మెదక్ వైపు నుంచి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తునానరు. మెదక్-బొడ్మట్‌పల్లి రోడ్డుపై హార్వెస్టర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు గొండ్ల సాయిలుకు భార్య నిర్మల ఇద్దరు పిల్లు ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కంటైనర్ లారీలో మంటలు



తగులబడుతున్న కంటైనర్

పటాన్‌చెరు టౌన్: కంటైనర్ లారీలో మంటలు చెలరేగిన ఘటన పటాన్‌చెరు మండలం పరిధిలో చోటు చేసుకుంది. డ్రైవర్ కథనం మేరకు.. ముంబై నుంచి ఓ కంటైనర్‌లో లారీ భువనగిరి జనరేటర్‌ను తీసుకెళ్తున్నాం. మండల పరిధిలోని రుద్రారం జాతీయ రహదారిపై గణేశ్ గడ్డ దేవస్థానం సమీపంలోకి రాగానే చిన్న స్పార్క్ వచ్చి లారీలో మంటలు వ్యాపించాయి. లారీ పూర్తిగా కాలిపోగా దీంతో అప్రమత్తమై కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని డ్రైవర్ పేర్కొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్) : అనారోగ్య సమస్యలతో మనోవేదనకు గురై విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన చుక్క స్వామిప్రదీప్(17) తూప్రాన్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మూడేళ్ల కిందట సైకిల్ పై నుంచి పడి తీవ్రగాయాలై డిప్రెషన్‌కి లోనవుతూ ఇబ్బంది పడ్డాడు. కొద్ది రోజుల నుంచి మానసిక స్థితి బాగాలేకపోవడంతో తీ వ్ర మనో వేదనకు గురై శుక్రవారం ఇంట్లోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

లారీ, ఆటో ఢీ : ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, లారీ

వట్‌పల్లి(అందోల్): లారీ, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నాసాగర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చింతకుంట వైపు నుంచి దానంపల్లి గ్రామానికి వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అందోలు మండలం దానంపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య, మల్లేశం, పోచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోచయ్యకు పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



డివైడర్‌పై ప్రమాదకరంగా బస్సు

డివైడర్ పైకి దూసుకెళ్లిన బస్సు

25 మందికి స్వల్ప గాయాలు

కన్‌సాన్‌పల్లి వద్ద నాందేడ్ హైవేపై ఘటన

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి వద్ద ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 25 మందికి ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణ ఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం నారాయణఖేడ్ నుంచి జోగిపేట వైపు వస్తున్న క్రమంలో కన్‌సాన్‌పల్లి గ్రామ రోడ్డు వద్దకు రాగానే అదుపు తప్పి జాతీయ రహదారి డివైడర్ పైకి ఎక్కింది. బస్సులో సుమారుగా 50 మందికి పైగా ఉండగా 25 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో హనుమంతరావుపేటకు చెందిన అంబాదాస్‌కు తలకు, గడి పెద్దాపూర్‌కు చెందిన సుజాత కాలు విరిగింది, ఆమె కొడుకు అనిల్ కు చెయ్యి విరిగింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జోగిపేట ఎస్‌ఐ పాండు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమా దం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు.



స్కై వాచ్ ప్రదర్శనను తిలకిస్తున్న జేవీవీ సభ్యులు

ఆకట్టుకున్న ఇన్‌స్పైర్, సైన్స్ ప్రాజెక్టులు

- తిలకించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు
- భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరు



ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



మేక ఊపిరితిత్తులతో చేసిన ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిట్‌ల ప్రదర్శన రెండురోజు శుక్రవారం కొనసాగింది. ఇందులో విద్యార్థులు అనేక ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. వీటిని తిలకించి, నూతన విషయాలను తెలుసుకునేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ ప్రదర్శనను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై తిలకించారు. అనంతరం ఆయన హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలోనూ సైంటిస్ట్ ఉన్నాడన్నారు. సమాజాన్ని మార్చే విధంగా సామాజిక వేత్తలుగా ఎదుగాలన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రదర్శనలు, వరదలు వస్తే అలర్ట్ చేసే అలారం, సోలార్ విద్యుత్ వినియోగం, తదితర ప్రాజెక్టులు ఆకర్షించాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో పోటీ పడి పరీక్షల్లో రాణించడం, ఇంగ్లిష్‌లో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు సోషల్‌మీడియా, డ్రగ్స్‌కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆల్ఫాజోలం, ఎండు గంజాయి కాల్చివేత



ఆల్ఫాజోలం, ఎండు గంజాయితో పోలీసులు

- మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రూ.19,86,750 విలువైన 3,988 కిలోల ఆల్ఫాజోలం, 455.293 కిలోల ఎండు గంజాయి, 33.450 కిలోల గంజాయి చాక్లెట్లు కాల్చివేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 12 కేసుల్లో నిందితుల నుంచి వీటిని పట్టుకొని సీజ్ చేశామన్నారు. సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడల్లో మెడికేర్ పరిశ్రమలో కాల్చివేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, కమిటీ సభ్యులైన అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగ నాయక్, డీసీఆర్బీ సీఐ మధుసూదన్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, మెడికేర్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- రూ.52 లక్షలతో వసూలు చేసి పరారీ
- సంగారెడ్డిలోని కపిల్ చిట్ ఫండ్స్ బ్రాంచ్‌లో ఆలస్యంగా వెలుగులోకి..

సంగారెడ్డి క్రైమ్: నెలవారీ చిట్టీల పేరుతో రూ.52 లక్షల కుచ్చుటోపీ పెట్టిన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డిలోని కపిల్ చిట్ ఫండ్స్ బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోల్ మహేశ్వర్ 22 తేదీన వినియోగదారుల నుంచి, ఉద్యోగుల నుంచి చిట్టీల పేరుతో రూ.52 లక్షలు వసూల్ చేశారు. అనంతరం రాత్రికిరాత్రే పరారయ్యాడు. 23న నాల్గో శనివారం ఆదివారం వరుస సెలవులు రావడంతో తిరిగి సోమవారం ఆఫీస్‌కు వచ్చిన ఉద్యోగులు రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో నగదుకు సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అనుమానం వచ్చి మహేశ్వర్‌కు ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదు. చిట్ ఫండ్స్‌లో స్థానిక ఉద్యోగి అయిన సంతోష్ నగర్‌కి చెందిన బోనగిరి నితిన్ గౌడ్, పలువురు ఉద్యోగులు 27న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాత వంతెనలు.. అవే మరమ్మతులు

- ముప్పై ఏళ్ల కిందట నిర్మాణం
- దెబ్బతిన్న నాణ్యత
- మరమ్మతులతో సరిచేసే ప్రయత్నం




కొడకండ్ల వద్ద రాజీవ్‌రహదారిపై ఉన్న పాత వంతెనపై మరమ్మతులు

గజ్వేల్ : రాజీవ్ రహదారి పాత వంతెనలు నాణ్యతపై టెన్షన్ అలుముకుంది. ఈ రహదారిపై సుమారు ముప్పై ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో అధికారులు మరమ్మతులతో సరి చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో కీలకమైన ఈ రహదారిపై ఉన్న వంతెనలు ప్రమాదకరంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కొత్త, పాత వంతెనలపైకి వాహనాలు

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నుంచి సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల మీదుగా రామగుండం, మంచిర్యాల ప్రాంతం వరకు 207 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించారు. 12 ఏళ్ల కిందట ఈ రోడ్డు విస్తరణకు రూ.1,450 కోట్లకు పైగా వెచ్చించారు. బీఓటీ (బిల్ట్ ఆపరేటర్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఈ పనులు పూర్తి చేశారు. ఉత్తర తెలంగాణలోని మేడ్చల్, సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో గల పలు జాతీయ రహదారులను కలిపే ఈ దారి అత్యంత కీలకమైనది. ప్రత్యేకించి హైద్రాబాద్ అవుటర్ రింగురోడ్డు, వరంగల్ హైవే, నేషనల్ హైవే 44 తదితర హైవేలతో పాటు కొత్తగా నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్‌తోనూ ఈ రహదారి అనుసంధానం కానున్నది. అలాంటి 207 కిలో మీటర్ల పొడవున్న రోడ్డు విస్తరణలో భాగంగా 7 మేజర్, 32 మైనర్, 3 కొత్త ఆర్‌ఓబీలను నిర్మించారు. వీటికి సమాంతరంగా పాత వంతెనలు మేజర్ 7, మైనర్ 32 ఆర్‌ఓబీలు ఉన్నాయి. 12 ఏళ్ల కిందట రాజీవ్ రహదారి విస్తరణ తర్వాత పాత వంతెనల పక్కన చాలా వరకు కొత్త వంతెనలు నిర్మించారు. ఇందులో రెండు లైన్లకు కొత్త వంతెనలను, మరో రెండు లైన్లకు పాత వంతెనలను వాడుతున్నారు. కొన్ని చోట్ల మినహా చాలా చోట్ల కొత్త వాటికి సమాంతరంగా పాత వంతెనలను వాడుతున్నారు.

కూలిపోయే పరిస్థితి

పాత వంతెనలు ముప్పై ఏళ్ల కిందట నిర్మించడంతో వాటి నాణ్యత దెబ్బతిని పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై అధికంగా లోడ్ ఉండే భారీ వాహనాల రాకపోకలు సాగడంతో వంతెనల జాయింట్లు ఊడిపోయి ప్రమాదకరంగా మారాయి. ఒక్కో చోట వంతెనలు కుప్పకూలిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే కరీంనగర్ సమీపంలోని రేణిగుంట, మానేరు, గోదావరిఖని, పెద్దపల్లిల వద్ద పాత వంతెనలను సరిచేశారు. తాజాగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద పాత వంతెనను కొన్ని రోజులుగా మరమ్మతు చేస్తున్నారు. ప్రస్తుతం మరమ్మతు చేస్తున్న పాత వంతెనల నాణ్యత ఎంతకాలం పదిలంగా ఉంటుంది? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశంపై ఈ రహదారిని పనులను పర్యవేక్షిస్తున్న హెచ్‌కేఆర్ కంపెనీ డీజీఎమ్ విజయ భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా...పాత వంతెనల నాణ్యతను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా రహదారిపై ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తున్నామన్నారు.